క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా మైత్రీనగర్ 11 కేవీ. ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ శరత్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని మైత్రీనగర్ ఇండస్ట్రియల్ ప్రాంతం, విజ్ఞానపురి కాలనీ, ఏవీబీ పురం, శక్తిపురంలలో అదే విధంగా 11 కేవీ పాపిరెడ్డినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు హనుమాన్‌నగర్, పాపిరెడ్డినగర్, రామకృష్ణానగర్, ప్రగతినగర్‌లలో విద్యుత్ నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

అంబీర్ చెరువు పరిసరాలు శుభ్రం

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువులో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హైటెక్ సిటీకి చెందిన రెండు ప్రైవేట్ సంస్థలు మూడు రోజుల పాటు చెత్తాచెదారాన్ని తొలగించారు. సుమారు 450 మంది వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని 2500 కేజీల చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. చెరువు వాకింగ్ ట్రాక్‌పై మొక్కలు నాటి ట్రీగార్డ్‌లు ఏర్పాటు చేశారు. తమ సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వలంటీర్స్ పేర్కొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న కార్పొరేటర్ శిరీష బాబూరావు

మూసాపేట: బాలాజీనగర్ పరిధిలోని కూకట్‌పల్లి ద్వాదశ జ్యోతిర్లింగ శివాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పత్రీజీ మహిళా చైతన్య కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ శిరీష బాబూరావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగా చేయటం అందరికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని, దీనితో శ్వాసపై ధ్యాస కలుగుతుందన్నారు. మానసికంగా, శారీరకంగా ఉన్న ఒత్తిడిని జయించి ప్రశాంతంగా ఉండేటట్లు చేస్తుందని తెలిపారు.

నేడు శేరిలింగంపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని కాలనీల్లో సుమారు రూ.8.46 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు క్యాంప్ కార్యాలయ అధికారులు తెలిపారు. లింగంపల్లి విలేజ్ నుంచి తారానగర్ వరకు వరదనీటి కాలువ పనులను రూ.5.5 కోట్లతో, వెంకట్‌రెడ్డి కాలనీలో రూ. 50 లక్షలతో సీసీ రోడ్డు పనులు, బృందావన్ కాలనీలో రూ.46లక్షలతో సీసీ రోడ్డు, భాగ్యలక్ష్మీ కాలనీలో రూ. 50 లక్షలతో సీసీ రోడ్డు, శిల గార్డెన్ కాలనీలో రూ, 50 లక్షలతో సీసీ రోడ్డు, సెంట్రల్ పార్కు ఫేజ్-2 కాలనీలో కోటి రూపాయలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

చందానగర్‌లో మీ సేవ కేంద్రం ప్రారంభం



హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని న్యూ శంకర్‌నగర్‌లో మీ సేవ కేంద్రంను ఆదివారం ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డిలు కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ప్రసాద్, అక్బర్ ఖాన్, సందీప్ రెడ్డి, వరలక్ష్మి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఐడీపీఎల్ జంక్షన్‌లో మల్టీపర్పస్ ఫ్రెష్ రూమ్

జగద్గిరిగుట్ట: ఐడీపీఎల్ జంక్షన్ వద్ద మల్టీపర్పస్ ఫ్రెష్ రూమ్ గ్రేటర్ పరిధిలో ప్రజల సౌకర్యార్థ మల్టీపర్పస్ ఫ్రెష్ రూమ్స్ ఏర్పాటుకు జీహెచ్ఎంసీ రంగం సిద్ధం చేశారు. గ్రేటర్ ఉన్న 6 జోన్‌లలో వివిధ కూడళ్ల వద్ద సుమారు 23 మల్టీపర్పస్ ఫ్రెష్ రూమ్స్ కట్టడానికి ఓ ప్రైవేటు సంస్థతో జీహెచ్ఎంసీ ఒప్పందం కుదుర్చుకుంది. నిర్వహన బాధ్యత కూడా 14 సంవత్సరాల పాటు వారికే అప్పగించింది. దీనిలో భాగంగా కూకట్‌పల్లి జోన్‌లో ఐడీపీఎల్ జంక్షన్ వద్ద ఒకటి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ చౌరస్తాలో లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, జంక్షన్ అభివృద్ధిలో భాగంగా రూపురేకలు మారాయి. ఇక మల్టీపర్పస్ ఫ్రెష్ రూమ్స్ ఏర్పాటుతో మరింత కళ రాబోతుంది. మల్టీపర్పస్ ఫ్రెష్ రూమ్స్‌లో మూత్రశాలకు డబ్బులు చెల్లించే అవసరం లేకపోగా మరుగుదొడ్లు వినియోగానికి రూ.5, స్నానానికి రూ 7 వసూలు చేస్తారు. 4 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్స్ వివిధ కారణాల వలన సక్సస్ కాకపోవడంతో ఈసారి ఈ మల్టీపర్పస్ ఫ్రెష్ రూమ్స్ ఏర్పాటు ఓ సవాల్‌గా తీసుకున్నారు.

బోనం.. వైభవం

- భక్తిశ్రద్ధలతో బోనాలు వేడుకలు
- కిటకిటలాడిన ఆలయాలు


ప్రత్యేక అలంకరణలో మైసమ్మ


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్


మహంకాళికి పూజలు చేస్తున్న గొట్టిముక్కల వెంగళరావు తదితరులు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌పీ రోడ్డులోని మైసమ్మ ఆలయంలో ఆలయ నిర్వాహ కులు తూము జగదీష్ ఆధ్వర్యంలో బోనాలను ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మూసాపేట మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మహిళలు అమ్మవారికి బోనాల మొక్కులు సమర్పించారు. సాయంత్రం ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు సుఖః సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. బోనాల పండుగను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు తూము నారాయణ, జనరల్ సెక్రటరి మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు షబ్బీర్, నాయకులు శ్రీకాంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు..

హెచ్‌బీ రోడ్డులో తూము ఎల్లారావు ఆధ్వర్యంలో ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా ఆదివారం మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూకట్‌పల్లి మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూము వేణు, తూము వెంకట్రావు, మల్లికార్జున, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దళితుల ఐక్యవేదిక మెంబర్‌షిప్


దళితుల ఐక్యవేదిక సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ఎన్‌సీఎస్ గార్డెన్‌లో ఆదివారం దళితుల ఐక్యవేదిక సర్వ సభ్యసమావేశం నిర్వహించారు. రాబోయే రెండేళ్లకు దళితుల ఐక్యవేదిక సెంట్రల్ కమిటీకి ఎన్నికలు నిర్వహించడానికి నూతనంగా మెంబర్‌షిప్ తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. మెంబర్‌షిప్‌ను రూ.100గా నిర్ణయించారు. మెంబర్‌షిప్ కావాల్సిన వారు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు. ఈ నెల 10 నుంచి 31వ తేదీ వరకు 20 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కమిటీ ఎన్నికలు ఆగస్టు 12న ఉంటుందని తెలిపారు. అదే విధంగా దళితుల ఐక్యవేదిక పేరు ఎవరైనా వాడుకున్నా, ఆ పేరుపై సంఘం పెట్టినా కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా కర్క పెంటయ్య, ఎన్నికల అధికారులుగా బోడ నర్సింగ్‌రావు, పి. యాదయ్య, ఎస్‌పీ లక్ష్మణ్, జినుగు పుల్లారావులను నియమించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కర్క పెంటయ్య, వైస్ చైర్మన్ బోడ నర్సింగ్‌రావు, నపారి చంద్రశేఖర్, సింగూరి పాండు, యడ్ల సత్యనారాయణ, బండి సుధ, యడ్ల సదానంద్, పి. యాదయ్య, యడ్ల ప్రభాకర్, ఎస్.పి. లక్ష్మణ్, టింపుల్ సత్యనారాయణ, కంచర్ల శ్రీను, మేకల నర్సింగ్‌రావు, బొట్టు విష్ణు పాల్గొన్నారు.

నూతన పాలక కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



మోతీనగర్: నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు సహాయం అందించడానికి కృషిచేస్తానని బోరబండ మోతీనగర్ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు సాయిబాబాగుప్తా పేర్కొన్నారు. ఆర్‌కే సొసైటీలో ఆర్యవైశ్య సంఘం భవనంలో నూతన పాలక కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సాయిబాబా గుప్తా మాట్లాడుతూ.. సంఘంలో నూతన సభ్యత్వాన్ని చేయించడానికి విస్తృతంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసగుప్తా, పొలిటికల్ చైర్మన్ ఊటుకూరి శ్రీనివాస్ గుప్తా, మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గుప్తా, కోశాధికారి కొండ ప్రేమ్ కుమార్ గుప్తా, మహిళా అధ్యక్షురాలు పబ్బా సుధా, ప్రధాన కార్యదర్శి కందుకూరి లలిత, కోశాధికారి మీనా, లక్ష్మీనారాయణ గుప్తా, సత్యనారాయణ గుప్తా పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్



ఆల్విన్‌కాలనీ: జయశంకర్ కాలనీలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం, ఇతర కోర్సులు ప్రారంభ వేడుకల్లో ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వహిస్తున్న ఉచిత కోర్సుల గురించి వివరించారు. క్యాంప్‌లో శిక్షణ పొంది ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. విద్యార్థులకు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, టైలరింగ్ వంటి మొత్తం 11 రకాల కోర్సులను ఉచితంగా అందిస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, సంస్థ మేనేజర్ రాములు, కరీం, షేక్ బీబీ, డాక్టర్ సౌమ్య, బ్రహ్మకుమారిస్ శ్రీకాంత్, పోశెట్టిగౌడ్, సాయిగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

వరద నీటి కాలువ పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్లపై వర్షపు నీరు నిలువకుండా వరదనీటి కాల్వ నిర్మాణ పనులను చేపడుతున్నట్లు హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడైతే రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోతుందో ఆయా ప్రాంతాలను గుర్తించి వరదనీటి కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు రవి, బోసు బాబు, కోటేశ్వరరావు, రామకోటేశ్వరరావు, కిషోర్, ఆదిత్య, అనిల్, వినయ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'జీఓ.59 పేదలకు గుదిబండగా మారింది'

కుత్బుల్లాపూర్: ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ.59 పేద ప్రజలకు గుదిబండగా మారింది. ఇప్పటికే కుత్బుల్లాపూర్, బాచుపల్లి, దుండిగల్ మండలాల పరిధిలో రెవెన్యూ అధికారులు కూల్చివేతల పర్వం కొనసాగిస్తుండగా పలువురు ఆదివారం ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ శంభీపూర్ రాజు నివాసానికి వెళ్లి తమ గోడును చెప్పుకొచ్చారు. 2014 జీవో ప్రకారం పాఠశాలల యాజమాన్యాలకు 10 శాతం కడితే క్రమబద్ధీకరణ చేపడతామని అప్పట్లో చెప్పి ఇప్పుడు ఏకంగా 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు కట్టమని నోటీసులు జారీ చేయడం అదేవిధంగా కూల్చివేతలు చేపడతామని జేసీబీలతో వస్తున్నారని అన్నారు. ఈ విషయంపై ప్రభుత్వంతో మాట్లాడాలని మేడ్చల్ జిల్లా ట్రస్మా ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి అభ్యర్థించారు. అదే విధంగా వివిధ ప్రాంతాల్లో పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురాగా వెంటనే అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుత్బుల్లాపూర్ గాజులరామారం దుండిగల్ నిజాంపేట్ కొంపల్లి ప్రాంతాల నుంచి పలువురు ఎమ్మెల్సీ నివాసానికి వెళ్లి సమస్యలు ఏ కరువు పెట్టారు.


మందులు అందజేసిన పన్నాల హరీష్‌రెడ్డి


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మోతీనగర్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు మాజీ అధ్యక్షుడు నలమాల్పు అంజిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో అమోర్ ఆస్పత్రి, ఎంసీహెచ్ఎస్ సీనియర్ సిటిజన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు మధుమేహం, బీపీ, ఈసీజీ వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చిల్లి శ్రీనివాస్, జగన్నాథం గౌడ్, కంచర్ల శ్రీనివాస్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

కూకట్‌పల్లి: ప్రధాని మోదీ తొమ్మిది ఏళ్ల విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ఏవీబీ పురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ శిబిరంలో అనేకమంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. మూసాపేట కార్పొరేటర్ మహేందర్, అర్కనపల్లి సూర్యరావు, గంధం రాజు, యంజాల పద్మయ్య, గున్నాల వినోద్ పాల్గొన్నారు.

13 నుంచి కొంపల్లి దుర్గామాత కల్యాణ మహోత్సవం

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శ్రీదుర్గా మాత, శ్రీ మహంకాళి ఆలయంలో అమ్మవార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు జంద మంజుల కుమార్‌గౌడ్, భైరి శ్రీవిద్య ప్రశాంత్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 13న సాయంత్రం 6గంటలకు గంగతెప్పకు వెళ్లడం, 14న ఉదయం 10గంటలకు మహంకాళి అమ్మవారి కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, రాత్రి 9 గంటలకు దుర్గామాత కల్యాణం, 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు అమ్మవార్లకు బోనాల ఊరేగింపు ఉంటుందని, మున్సిపల్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్ల ఆశీర్వాదం పొందాలని నిర్వాహకులు కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్: బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కురుమ బస్తీ, వినాయకనగర్ బస్తీల్లో నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి కొత్త డ్రైనేజీ పైపులైన్‌లు వేయించడంతో పాటు, రోడ్లకు మరమ్మతులు చేపట్టేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట సత్తయ్య, నార్లకంటి దుర్గయ్య, ఉలిపి మల్లేష్, నందు గౌడ్, వీరేశం,వనజ, అబిద్, వెంకట్, జయంత్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

◆ అయోధ్యనగర్‌లో మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని భరతసింహారెడ్డి ప్రారంభించారు. పేద ప్రజల నివాసిత ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బస్తీ అధ్యక్షుడు యేసు, మల్లేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.


బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

బొడ్రాయి పూజలు

మూసాపేట: మూసాపేటలో ఆదివారం గ్రామ పెద్దలు బొడ్రాయి పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో బోనాల పండుగకు ముందు బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్ కుమార్, సప్పిడి శ్రీనివాస్‌రావు, యాదయ్య, శ్రీనివాస్, బాబూరావు, టి. విజయ్ కుమార్, బస్తీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేసిన మహమ్మద్ గౌసుద్దీన్ తదితరులు

భూమి పూజ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్ ఈ బ్లాక్‌లో శ్రీకాకుళం బడుగు బలహీన వర్గాల వారికి కమ్యూనిటీ హాల్ నిమిత్తం ఆదివారం కార్పొరేటర్ సబిహాబేగం ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్‌ను భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఆయన సొంత నిధులతో స్థలాన్ని ఎంపిక చేసి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, అబ్దుల్ హమీద్, దేవాది హరినాథ్, జ్ఞానేశ్వర్, తారాసింగ్, రమణ, నారాయణరావు, తిరుపతిరావు, కగేశ్వరరావు, సంజీవ పాల్గొన్నారు.

కాలనీల్లో వసతుల కల్పనే ధ్యేయం


లింగంపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆదివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా లింగంపల్లి ఎస్సీ బస్తీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ కాలనీల్లో మెరుగైన వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు ఉన్నాయన్నారు. అదే విధంగా వెంకట్‌రెడ్డి కాలనీ, బృందావన్ కాలనీల్లో సీసీ రోడ్ల పనుల విషయమై జీహెచ్ఎంసీ అధికారులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు వీరేశంగౌడ్, రాంచందర్, శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, రవియాదవ్, అజీమ్, సుభాష్ రాథోడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కనువిందు.. కూచిపూడి నృత్యం

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం గణేశకైతం, రుక్మిణీ ప్రవేశం, బ్రహ్మమొక్కటే అంశాలను ప్రదర్శించి అలరించారు. వరంగల్‌కి చెందిన కూచిపూడి నాట్యగురువు తాడూరి రేణుక శిష్యబృందం ఆనందనర్తన, గణపతిమ్, బ్రహ్మాంజలి, మహాగణపతిం, ఇదిగో భద్రాద్రి తదితర అంశాలను ప్రదర్శించారు. సాయిచరణ్, రాధిక, రిషిత, విలాసిని, భ్రమరీ, అద్వైత, అవని, ఆరాధ్య, నిశిత, వరాళిక, తదితరులు పాల్గొన్నారు. నటులు బి.ఎం.రెడ్డి, దర్శకులు ప్రవీణ్‌చందర్‌లు కళాకారులను నాట్యరత్న, నాట్యబాల అవార్డులతో సత్కరించారు.



కాంగ్రెస్ పార్టీతోనే మహిళాభివృద్ధి సాధ్యం


కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మహిళలు

జగద్గిరిగుట్ట: కాంగ్రెస్ పార్టీతోనే మహిళాభివృద్ధి సాధ్యమని.. ఎందరో మహిళలకు ఉన్నత హోదాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం మాజీ కౌన్సిలర్ వరమ్మ ఆధ్వర్యంలో రాజీవ్‌గృహకల్ప, శ్రీరామ్‌నగర్, కూన మహాలక్ష్మినగర్‌లకు చెందిన 150 మంది మహిళలు కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. దేశ రాజకీయాలను మార్చగలిగే సత్తా మహిళలకు ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మహిళలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్‌లను అందిస్తామన్నారు. కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేలా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడి, మాజీ వార్డ్ మెంబెర్ గణేష్, శ్రీనివాస్ చారి, వీరారెడ్డి, మాధవ్‌రెడ్డి, లాయక్, జేమ్స్, మహిళ కాంగ్రెస్ నాయకులు కౌసల్య, కమల పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు, సిబ్బంది


కుండీల్లో నీటి నిల్వను తొలగిస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: ప్రతి ఆదివారం 10 గంటలకు 10 నిమిషాలు అనే కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ నివాసంలో మొక్కల కుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల ఉత్పత్తికి కారణమైన నీటిని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంట్లోని నీటి నిల్వలను వారానికి ఒక్కసారైనా తీసివేసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఇంట్లోని పాత వస్తువులు, సామాన్లు, చెత్తా చెదారం ఉండకుండా చూసుకోవాలని, సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరేష్, సిబ్బంది, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన..

ఆల్విన్‌కాలనీ: మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు జీహెచ్‌యంసీ కమిషనర్ ఆదేశాలతో ఆదివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీలో ఎంటమాలజి సూపర్‌వైజర్ నరసింహులు, సిబ్బందితో కలిసి ఆదివారం 10 గంటల 10 నిమిషాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించాలని, సంపులు, డ్రమ్ములు, పూలకుండీలు, టైర్లు కూలర్స్, కుండలు, నల్లా గుంతలు ప్లాస్టిక్ సెంటెక్స్, రిఫ్రిజిరేటర్, ప్లాస్టిక్ డబ్బాలను వారానికి ఒక్కసారైనా శుభ్రం చేసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉన్న వాటికి మూతలుపెట్టుకోవాలని సూచించారు. దోమలతో డెంగ్యూ జ్వరం, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడు వాపు తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పీజేఆర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132